## క్లుప్తంగా

### పీహెచ్‌సీ సందర్శన

**కామేపల్లి:** మండలంలోని కొత్తలింగాల ఆరోగ్య ఉప కేంద్రాన్ని పీహెచ్‌సీ వైద్యాధికారి నెల్లూరి చందన గురువారం ఆకస్మికంగా సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వానాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు అందించాలని, పీహెచ్‌సీలోనే ప్రసవాలు జరిగేలా చూడడంతో పాటు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ సుధారాణి, ఏఎన్‌ఎం సక్కుబాయి, ఆశాలు పాల్గొన్నారు.

### లాఠీచార్జ్ దుర్మార్గం

**నేలకొండపల్లి:** నీట్ పరీక్ష పత్రాలు లీక్ విషయమై గురువారం ఢిల్లీలో చేపట్టిన నిరసన కార్యక్రమంలో నేలకొండపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని పాల్గొన్నారు. కాగా, ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న సందర్భంగా లాఠీచార్జ్ చేశారు. ఈ సందర్భంగా అంజిని మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని, వారి తీరు మార్చుకోవాలని సూచించారు. ఆందోళనకారులపై లాఠీచార్జీ దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

### నీట్‌ను రద్దు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

**ఖమ్మం సహకారనగర్:** నీట్ పరీక్షను రద్దు చేసి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని విద్యా పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎస్.విజయ్ డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం విద్యా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యాన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ విధానాన్ని తిరస్కరించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాభివృద్ధికి కృషి చేయాలని, రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులను కేటాయించాలని తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, మనోహర్‌రాజు, బాబురావు, ఆజాద్, నాగేశ్వరరావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

### గురుకులంలో వైద్య శిబిరం

**నేలకొండపల్లి:** స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గురువారం మండల వైద్యాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యాన వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వివిధ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణాన్ని పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రమీల, పి.ప్రభాకర్‌రావు, వైద్యాధికారి నిరోషా, వీరన్న, చంద్రశేఖర్, పాఠశాల హెల్త్ సూపర్‌వైజర్ దివ్య, ఏఎన్‌యం యశోద, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో కలిసి రావాలి

**రఘునాథపాలెం:** ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమిస్తున్న మంద కృష్ణ మాదిగకు అందరూ అండగా ఉండాలని మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎమ్మార్పీఎస్) జిల్లా అధ్యక్షుడు తూరగంటి అంజయ్య కోరారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల ఆవిర్భావ వేడుక సందర్భంగా వచ్చేనెల 7న వరంగల్‌లో నిర్వహించే సదస్సుకు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం మంద గోపాల్‌రావు అధ్యక్షుడిగా మండల అడ్‌హక్ కమిటీని ప్రకటించారు. ఈ సమావేశంలో గాజుల నర్సింహారావు, కొరకొప్పుల వెంకటేశ్వర్లు, గాజుల ముత్తయ్య, తూరుగంటి సూర్యం, గాజుల వెంకటేశ్వర్లు, మంద వెంకటేశ్వర్లు, మాచర్ల రామకృష్ణ, మంద విజయ్, పెనుగూరి నాగేశ్వరరావు, దాసరి వెంకటేశ్వర్లు, నేలాల గురవయ్య, కత్తి మోషే, తగరం రాజశేఖర్, మంద ఉపేందర్, నామవరపు ఉదయ్ కిరణ్, గాజుల సైదులు, తూ రుగంటి మంగయ్య, కోలిగిపోగు అనిల్ మాదిగ, నేలాల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | కల్కి |
| వినోద | కల్కి |
| సాయిరాం | కల్కి |
| ఆదిత్య | కల్కి, మహారాజ |
| శ్రీనివాస | కల్కి |

- ఖమ్మంగాంధీచౌక్

# వసతి దూరం.. చదువు భారం!

**నగరానికి దూరంగా గిరిజన ఆశ్రమ పాఠశాలలు**

- వసతిగృహాల్లో సీట్ల కోసం పాట్లు
- ఎస్సీ, బీసీ శాఖలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు
- అక్కడ సీట్లు లేకపోవడంతో వెనుదిరుగుతున్న వైనం
- పట్టించుకోని గిరిజన సంక్షేమశాఖ అధికారులు



కొణిజర్ల మండలం బస్వాపురంలోని గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాల

**గిరిజన సంక్షేమశాఖ అధికారుల తీరు జిల్లాలోని గిరిజనుల్లో అసహనాన్ని రేకెత్తిస్తున్నాయి. తమ పిల్లల కోసం ఖమ్మం జిల్లా కేంద్రంగా ఒక్క ప్రీ మెట్రిక్ వసతి గృహం, ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయలేదు. అంతేకాక గతంలో ఖమ్మంలో ఉన్న వాటిని దూరంగా తరలించడంతో ఉండడానికి వసతి లేక చదువుకునేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు, పాలకులు ఎవరూ పట్టించుకోవడం లేదు.**

**ఖమ్మంమయూరిసెంటర్:** పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య, వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను నిర్వహిస్తుంది. దీనిలో చేరిన విద్యార్థులు అందులోని వసతి, భోజన సదుపాయాలు పొంది, వసతి గృహానికి దగ్గరలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ ఉంటారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యాన పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం వసతి గృహాలను నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంగా ఈ మూడు శాఖల ఆధ్వర్యాన ప్రీ, పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలను ఏర్పాటు చేశారు. గిరిజన సంక్షేమ అధికారులు ఖమ్మం కేంద్రంగా ఉన్న ఆశ్రమ పాఠశాలలను తీసుకెళ్లి బయట ఏర్పాటు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**విద్యార్థులకు దూరంగా..**

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఖమ్మంలో ఉన్న బాలబాలికల వసతిగృహాలను తొలగించి కొణిజర్ల మండలం బస్వాపురంలో ఆశ్రమపాఠశాలగా నిర్వహిస్తున్నారు. ఇక నగరంలో ఉన్న ఆశ్రమపాఠశాలలను గొల్లగూడెంకు మార్చారు. నాటి నుంచి ఖమ్మం కేంద్రంగా ప్రీ మెట్రిక్ వసతి గృహం, ఆశ్రమ పాఠశాలలు దూరంగా వెళ్లిపోయాయి. దీంతో 3 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ పిల్లలను ఖమ్మం కేంద్రంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదవించాలని ఆశపడుతున్న తల్లిదండ్రులకు నిరాశే మిగులుతుంది. ఖమ్మం కేంద్రంగా ఉన్న వాటిని అధికారులు ఇక్కడ నుంచి ఎందుకు తొలగించారని ప్రశ్నిస్తున్నారు. రూరల్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు ఉండడం లేదని, ఖమ్మం కేంద్రంగా వసతిగృహం ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతుంది. నగరంలో ఎస్టీ ప్రీ మెట్రిక్ వసతిగృహాలను ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నా.. వారు మాత్రం పట్టించుకోవడం లేదు.

**ఇతర వసతి గృహాలకు వెళ్తున్న విద్యార్థులు..**

ఖమ్మం నగరంలో గిరిజన ప్రీ మెట్రిక్ వసతి గృహాలు లేకపోవడంతో గిరిజన విద్యార్థులు ఇతర శాఖల వసతి గృహాల్లో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఖమ్మం కేంద్రంగానే ఉండి చదువుకోవాలనే ఆసక్తితో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తుండగా.. ఎస్టీ వసతిగృహాలు లేకపోవడంతో ఎస్సీ, బీసీ శాఖల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న వసతిగృహాలకు వెళ్లి సీట్లను కోరుతున్నారు. అక్కడ వారికి కేటాయించిన రిజర్వేషన్ కోటా సీట్లు అయిపోవడంతో ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులతో పైరవీలు చేయిస్తున్నారు. వసతిగృహాల్లో రిజర్వేషన్‌కు మించి సీట్లు ఇవ్వలేమని ఆయా శాఖల సంక్షేమ అధికారులు చెబుతుండడంతో విద్యార్థులు వెనుదిరుగుతున్నారు.

**జనాభా ప్రాతిపదికన పాఠశాలల ఏర్పాటు**

ప్రీ మెట్రిక్ వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చబడుతుంది. కొత్త ప్రీ మెట్రిక్ వసతిగృహాలు ఏర్పాటు చేయడానికి వీలు లేదు. కొత్త ఆశ్రమ పాఠశాల ఏర్పాటు చేయాలన్నా అది ఎస్టీ జనాభా ప్రాతిపదికనే ఉంటుంది. విద్యార్థులకు సీట్లు కావాలంటే గొల్లగూడెం, కొణిజర్ల ఆశ్రమపాఠశాలలకు వెళ్లొచ్చు.

– విజయలక్ష్మి, ఎస్టీ డీడీ, ఖమ్మం

# పారిశుద్ధ్య నిర్వహణపై కమిషనర్ సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ అగస్త్య

**ఖమ్మంమయూరిసెంటర్:** కేఎంసీ కమిషనర్‌గా అభిషేక్ అగస్త్య బాధ్యతలు చేపట్టిన తర్వాత గురువారం తొలిసారిగా ఆయన తన చాంబర్‌లో అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్‌తో కలిసి శానిటేషన్, టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. తొలుత శానిటేషన్‌పై సమీక్షించిన కమిషనర్ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరిగేలా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, జవాన్లు సమన్వయం చేసుకుంటూ పనులు చేయించాలన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వాహణకు సరిపడా వాహనాలు ఉన్నాయా? ఏమైనా మరమ్మతులకు గురయ్యాయా అనే వివరాలతో పాటు ఫాగింగ్, బయోమైనింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమై నగరంలో చేపట్టిన నిర్మాణాలకు సంబంధించి ఇచ్చిన అనుమతులు, ఇవ్వాల్సినవి ఎన్ని ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ఆయా విభాగాల్లో ఎంత మంది విధులు నిర్వర్తిస్తున్నారే వివరాలను తెలుసుకున్నారు.

### డివిజన్లలో సమస్యలు పరిష్కరించండి..

**ఖమ్మం మామిళ్లగూడెం:** నూతనంగా బాధ్యతలు చేపట్టిన కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యను గురువారం ఎస్సీ, ఎస్టీ, బీసీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా సంఘంతో పాటు మాల మహానాడు నాయకులు ఆయన చాంబర్‌లో మార్యదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 17, 27వ డివిజన్లలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఎన్నికల నోటిఫికేషన్ వలన కొన్ని ఆగిపోయాయని, వాటి పునఃరుద్ధణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపకుడు నారుమళ్ల వెంకన్న, మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, 27వ డివిజన్ బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పల్లి ఉపేందర్, ఉపాధ్యక్షులు కర్లపుడి వెంకన్న, పొట్టి శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

### కమిషనర్‌ను కలిసిన కార్పొరేటర్లు

**ఖమ్మంఅర్బన్:** ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అభిషేక్ అగస్త్యను కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు కార్పొరేటర్లు గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలు, పారిశుద్ధ్యంపై తీసుకోవాల్సిన చర్యలు తదితర వాటిని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లకావత్ సైదులు, పల్లెబోయిన భారతిచంద్రం, మలీదు వెంకటేశ్వర్లు, దుద్దుకూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌యూబీని పరిశీలించిన మేయర్



ఆర్‌యూబీని పరిశీలిస్తున్న మేయర్ నీరజ

**ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలోని సారథినగర్ –మామిళ్లగూడెం మధ్య నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యూబీ)ని నగర మేయర్ పునుకొల్లు నీరజ గురువారం పరిశీలించారు. బ్రిడ్జికి సంబంధించి రోడ్డు నిర్మాణ పనులు, డ్రెయినేజీ పనులను మేయర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. 49వ డివిజన్ మామిళ్లగూడెం నుంచి బైపాస్ రోడ్డు ఆంజనేయస్వామి దేవాలయం వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక కార్పొరేటర్ దుద్దుకూరి వెంకటేశ్వరరావు మేయర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ, మాజీ కార్పొరేటర్ నాగండ్ల దీపక్ చౌదరి, డీఈ శ్రీనివాస్, ఏఈ నవ్యజ్యోతి, ఉపేందర్, ఫరీద్, సింగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

**మేయర్‌ను కలిసిన హేమంత్..**

కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందిన కందుకూరి హేమంత్ సాయి గురువారం మేయర్ పునుకొల్లు నీరజను మర్యాదపూర్వకంగా కలిశారు. కేఎంసీలో విధులు నిర్వర్తించే లాలు ప్రమాదవశాత్తు మరణించగా ఆయన కుమారుడు హేమంత్ సాయికి కేఎంసీలో వార్డు ఆఫీసర్‌గా ఉత్తర్వులు అందగా ఆయన మేయర్‌ను కలిశారు.

# మొక్కల సంరక్షణలో నిర్లక్ష్యం వీడాలి



భైరవునిపల్లి నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

**నేలకొండపల్లి:** పంచాయతీలలో నాటే ప్రతీ మొక్కకు లెక్క ఉంటుందని, నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య అన్నారు. మండలంలోని ఆచార్లగూడెం, భైరవునిపల్లి గ్రామాల్లో గురువారం నర్సరీలను పరిశీలించిన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు పడుతున్న నేపథ్యాన ప్రతీ పంచాయతీకి ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, పారిశుద్ధ్య పనులు చేపట్టాలని చెప్పారు. నర్సరీ నుంచి వెళ్లే ప్రతీ మొక్కకు లెక్క కచ్చితంగా ఉండాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించి పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, భైరం దినేష్‌కుమార్, కె.నాగేశ్వరరావు, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

### పొలంలో అడ్డుగా ఉన్నాయని స్తంభాల తొలగింపు

**కామేపల్లి:** ఓ రైతు తన పంట పొలంలో ఉన్న విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని జేసీబీతో తొలగించిన ఘటన ఇది. మండలంలోని కొత్తలింగాలకు చెందిన రైతు నేలపట్ల జగన్నాథం పంట చేనులో నుంచి సమీప రైతుల పొలాలకు పదేళ్ల క్రితం విద్యుత్ లైన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ స్తంభాలు తన పొలానికి అడ్డుగా ఉన్నాయని జేసీబీతో తీయించాడు. ఈ విషయమై రైతుల ఫిర్యాదుతో గురువారం పరిశీలించిన అధికారులు మూడు స్తంభాలను తొలగించినట్లు గుర్తించారు. దీంతో ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన జగన్నాథంతో పాటుగా జేసీబీ యజమానులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

### మినీ డోమ్ థియేటర్ ప్రారంభం

**ఖమ్మం అర్బన్:** నగరంలోని మమత రోడ్డులోని ఈఆర్ఆర్ రిసార్ట్స్‌లో సీఎస్ గెలాక్సీ మినీ డోమ్ థియేటర్‌ను స్తంభాద్రి బ్యాంక్, ఈఆర్ఆర్ చైర్మన్ ఎర్నెనీ రామారావు గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెట్రో నగరాలకే పరిమితమైన డోమ్ థియేటర్ ఖమ్మంలో పరిచయం చేసిన థియేటర్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో థియేటర్ యాజమాన్యం గన్నవరపు చంద్రశేఖర్‌రావు, కొదుమూరి నాగపవన్‌తో పాటు నిరంజన్‌రెడ్డి, వసంత్ పటేల్, తెల్లాకుల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


### గురుపౌర్ణమి ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

**ఖమ్మంగాంధీచౌక్:** నగరంలోని గాంధీచౌక్ వరప్రదాత షిర్డీ సాయి మందిరంలో జూలై 7 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్న గురుపౌర్ణమి వేడుకల ఆహ్వాన శుభ పత్రిక ఆవిష్కరణ సాయి మందిరంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నిత్యం అభిషేక పూజలు నిర్వహించబడుతున్నందున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందిరం కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు, పీవీడీ ప్రసాద్, కాకరపర్తి సూర్యనారాయణ, కుసుమ శ్రీనివాస్, డాక్టర్ బుడిగం రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### పాపటపల్లి పంచాయతీ కార్యదర్శిపై విచారణ

**రఘునాథపాలెం:** మండల పరిధిలోని పాపటపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటరమణపై గ్రామానికి చెందిన కొంతమంది అవినీతి ఆరోపణలతో డీపీఓకు ఫిర్యాదు చేశారు. దీంతో డీపీఓ ఆదేశాల మేరకు గురువారం మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరెడ్డి విచారణ చేపట్టారు. ఈమేరకు ఫిర్యాదుదారులను పిలిపించి ఆయన విచారణ చేపట్టగా.. ఇంటి నిర్మాణ అనుమతులకు, సర్టిఫికెట్లు తదితర వాటిలో డబ్బులు డిమాండ్ చేశాడని తేలింది. మరో రోజు మిగిలిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ చేయాల్సి ఉందని, విచారణ పూర్తయ్యాక డీపీఓకు నివేదిక అందించనున్నట్లు ఎంపీఓ తెలిపారు.

# విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి




సమావేశంలో మాట్లాడుతున్న నామాల ఆజాద్

**ఖమ్మంమయూరిసెంటర్:** ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధి కనిపించడం లేదని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ అన్నారు. గురువారం స్థానిక ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి నేటి వరకు ప్రభుత్వం వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యారంగ బలోపేతం కోసం విద్యా కమిషన్ ఏర్పాటు చేస్తామని చెప్పి కనీసం విద్యాశాఖ మంత్రిని కూడా నియమించకపోవడం దారుణమని, వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కాలేజీ నాయకులు వినయ్, నరేందర్, శ్రీను, విష్ణు, పృథ్వీ, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**రఘునాథపాలెం:** మండలంలోని మంచుకొండ సబ్‌స్టేషన్ పరిధి మంచుకొండ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా నేడు(శుక్రవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ పోలూరి సతీష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫీడర్ పరిధిలో సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినయోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### రేపు న్యాయవాదులకు తరగతులు

**ఖమ్మం లీగల్:** నగరంలోని డీపీఆర్‌సీ భవనంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టాలపై రేపు(శనివారం) ఉదయం 10:30 గంటలకు ఐఏఎల్ ఆధ్వర్యాన న్యాయవాదులకు తరగతులు నిర్వహిస్తున్నట్లు ఐఏఎల్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులను వరంగల్ సీనియర్ న్యాయవాది గంటా విద్యాసాగర్‌రెడ్డి బోధిస్తుండగా.. న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### జయప్రదం చేయండి

**6న కేన్సర్ నిర్ధారణ శిబిరం..**



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

**ఖమ్మంమయూరిసెంటర్:** నగరంలోని మంచికంటి హాల్‌లో వచ్చే నెల 6వ తేదీన నిర్వహించే మెగా ఉచిత కేన్సర్ నిర్ధారణ శిబిరాన్ని జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, బీవీకే నాయకుడు వై.శ్రీనివాసురావు తెలిపారు. గురువారం నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో మహిళా వాకర్లకు కరపత్రాలు పంపిణీ చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. ప్రకాష్ ప్రాజెక్ట్స్ వారి సౌజన్యంతో నిర్వహించే ఈ శిబిరంలో 40 ఏళ్లు దాటిన మహిళలు మాత్రమే పాల్గొనాలని, పూర్తి వివరాలకు 98662 32511, 95736 91669 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ టూ టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, నాయకులు జె.వెంకన్న బాబు, నాగేశ్వరరావు, గుమ్మడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

**7న మాదిగల కవాతు..**

**నేలకొండపల్లి:** జూలై 7న వరంగల్‌లో చేపట్టనున్న మాదిగ ఉపకులాల కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ ఉపాధ్యక్షుడు వంగూరి ఆనందరావు పిలుపునిచ్చారు. మండలంలోని గువ్వలగూడెంలో గురువారం ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్రం చిత్తశుద్ధితో వ్యవహరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పి.బాలస్వామి, ప్రభాకర్, ఉపేందర్, నాగయ్య, బాలకృష్ణ, వీరబాబు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ పార్టీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాంరెడ్డి గోపాల్‌రెడ్డి

**కామేపల్లి:** మండలంలోని బాసిత్‌నగర్ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీని వీడి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి సమక్షాన గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారందరికీ పార్టీ కండువాకప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తుందని, రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధిస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనకు మెచ్చి జక్కుల పూజిత, శివలీల, అప్పారావు, కృష్ణ, అప్పయ్య, రవి, బాబు, గుంటి లింగయ్య, సుధీర్, ధరావత్ మంగీలాల్ పార్టీలో చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గింజల నరసింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దమ్మలపాటి సత్యనారాయణ, ఎంపీపీ బానోత్ సునీత, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, గుగులోత్ గబ్రూనాయక్, సొసైటీ అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు, హన్మంతరావు, రామకృష్ణ, సైదులు, బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన ర్యాలీ

**కూసుమంచి:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కూసుమంచి పోలీసుల ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.. యువత మత్తులో చిత్తు అవుతూ తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటివి అక్రమ రవాణా జరగకుండా చూడాల్సిన బాధ్యత యువతపైనే ఎక్కువగా ఉందని, ఆరోగ్యవంతమైన సమాజం కోసం పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై రామలింగారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

### వైన్‌షాప్‌ను తొలగించాలి

**తిరుమలాయపాలెం:** తిరులాయపాలెం ఎస్సీ బాలుర హాస్టల్ పక్కన ఉన్న వైన్‌షాపును ఊరి చివరకు తరలించాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యాన గురువారం జిల్లా ప్రొహిబిషన్ – ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైన్‌షాపు పక్కన ఉండడం వల్ల హాస్టల్ ప్రధాన గేటు మూసివేశారని, వెంటనే షాపును తొలగించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుర్ర ఉపేందర్‌సాహూ, జిల్లా అధ్యక్షుడు చెరుకుపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మిర్యాల నాగరాజు పాల్గొన్నారు.

### బ్రిడ్జి గుంతలో పడి వ్యక్తికి తీవ్ర గాయాలు

**నేలకొండపల్లి:** మండలంలోని పైనంపల్లి వద్ద జరుగుతున్న రహదారి నిర్మాణ పనులలో భాగంగా బ్రిడ్జి గుంతలో పడి ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి కథనం ప్రకారం.. ఈ నెల 9న రాత్రి సమయాన వెళ్తుండగా.. బ్రిడ్జి గుంతలో పడి కాలు విరగడంతో ఖమ్మంలో చికిత్స పొందుతున్నారు. కంపెనీ నిర్వాహకుల తప్పిదాల వలన ప్రమాదం జరిగినందున తనకు పరిహారం ఇవ్వాలని గురువారం కంపెనీ వారిని కోరారు.

### ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి విరాళం

**ఖమ్మంరూరల్:** మండలంలోని గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలను గురువారం భారత సైనిక మేనేజర్ మెడకంటి కిషోర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై ఆత్మ విశ్వాసాన్ని పెంచుకుని అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. అనంతరం పాఠశాల అభివృద్ధికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, హెచ్‌డబ్ల్యూఓ రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులు, సస్పెన్షన్లు ఎత్తివేయాలి




దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

**ఖమ్మంమయూరిసెంటర్:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)లో ఎస్ఎఫ్ఐ నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులు, విధించిన సస్పెన్షన్లను తక్షణమే ఎత్తివేయాలనిఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద దిష్టిబొమ్మ దహనం చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతీక్ అహ్మద్, ఎస్ఎఫ్ఐ యూనిట్ కార్యదర్శి కృపా జార్జ్ వీరితో పాటు మరో ఎనిమిది మంది విద్యార్థులకు ఆరు నెలలు సస్పెన్షన్, రూ.10 వేల ఫైన్ విధించి క్రిమినల్ కేసులు పెట్టడం దుర్మార్గపు చర్య అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.ప్రవీణ్ మాట్లాడుతూ హైదరాబాద్ యూనివర్సిటీ విద్యార్థి నాయకులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసి న్యాయం చేయాలని, వారికి మద్దతుగా జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రేమ్‌కుమార్, రాజు, వెంకటేష్, సహాయ కార్యదర్శి సీహెచ్.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.